క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: న్యూ కాలనీ ఫీడర్, దత్తసాయినగర్, శ్రీలా గార్డెన్, లోటస్ కాలనీ, మియాపూర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.బుధవారం ఉదయం 9 గంటల నుండి 4 గంటల వరకు న్యూ కాలనీ ఫీడర్ పరిధిలోని.. లక్ష్మీనగర్, న్యూ కాలనీ, దత్తసాయి కాలనీ, బాలాజీనగర్, లక్కీ రెస్టారెంట్ బ్యాక్ సైడ్, శ్రీలా గార్డెన్, నడిగడ్డ తండా, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, లోటస్ కాలనీ, మియాపూర్ ఫీడర్, అంగార రెస్టారెంట్, సత్య కళ్యాణ అపార్ట్‌మెంట్, ఆర్‌టీ డెవలపర్స్, లేక్ వ్యూ, శారదా స్కూల్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

మదీనగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

మదీనగూడ సబ్‌స్టేషన్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఓల్డ్ ముంబాయి రోడ్డు, వేముకుంట, కైలాస్ నగర్, జవహర్‌నగర్, విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, పద్మజా కాలనీ, సురక్ష హిల్స్, రాజేందర్‌రెడ్డినగర్, శుభోదయ ఎన్‌క్లేవ్, వికాస్ కాలనీ, అదేవిధంగా.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వేమనరెడ్డి కాలనీ, ఆర్మీ ఉదయన్ అపార్ట్‌మెంట్, వీకర్ సెక్షన్ కాలనీ, భవానీపురం, శంకరనగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 50, పచ్చిమిర్చి 90, బెండ 45, కాకర 60, దొండ 35, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 65, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 50 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 160.

22న 'మనూ'లో ఐటీఐ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఐటీఐలో అడ్మిషన్ల కోసం ఈ నెల 22వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ మంగళవారం తెలిపారు. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లోని వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి ఉదయం 9 గంటలకు ఈ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థులు రూ.60లు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 040-2008428 లేదా 9440692452 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

హఫీజ్‌పేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్‌కెవై ఫౌండేషన్‌ల సహకారంతో యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు యోగా ఆసనాలుంటాయని ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నందన కృపాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శివకుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్‌లు తెలియజేశారు. చందానగర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్ తదితర ప్రాంతాలల నుంచి విద్యార్థులు, ప్రజలు పాల్గొనాలన్నారు.

బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా సుధాకర్

మియాపూర్: బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా మియాపూర్ స్టాలిన్‌నగర్‌కు చెందిన వనం సుధాకర్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా మియాపూర్ ప్రాంతానికి చెందిన బీఎల్‌ఎఫ్ నాయకులు కుమ్మరి సుకన్య, తుకారాం నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని బాగ్‌లింగంపల్లి ఓంకార్ నగర్ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారని తెలిపారు.

నేటి నుంచి అందుబాటులోకి ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ సంస్థ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపో ఆధ్వర్యంలో మాదాపూర్‌లో నూతన టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రం(కార్గో, కొరియర్, పార్సిల్స్) అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మాదాపూర్‌లోని నిఫ్ట్ బస్టాపులో ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9652267204, 9849567204లో సంప్రదించాలని ఆయన కోరారు.

సల్మాఖాతూన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థిని సల్మాఖాతూన్‌కు మంగళవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట ప్రొఫెసర్ డాక్టర్ ముఖీమ్ అహ్మద్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమె 'వ్యవసాయంలో ఐఓటీ కోసం సమర్థవంతమైన సెమాంటిక్ నాలెడ్జ్ బేస్ డెవలప్‌మెంట్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ రెడీ



2019లో.. మాదాపూర్‌లో రోడ్డుపై వరద నీరు (ఫైల్)



గచ్చిబౌలిలో..

- 65 స్ట్రాటజిక్ లేబర్ టీమ్‌లు
- 13 మొబైల్ మాన్‌సూన్ టీమ్‌లు
- 23 వాహనాలు రెడీ

గచ్చిబౌలి: వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ అధికారులు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు. త్వరలోనే ఆయా అధికారులకు బాధ్యతలు అప్పగించనున్నారు. భారీ వర్షాలు కురిసినపుడు, అత్యవసర సమయంలో ఇబ్బందులను తొలగించేందుకు మొబైల్ టీమ్‌లను సిద్ధం చేయనున్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీలో భాగంగా వెస్ట్ జోనల్‌లో 13 మొబైల్ టీమ్‌లు పని చేయనున్నాయి. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 3, శేరిలింగంపల్లి సర్కిల్‌లో 4, చందానగర్ సర్కిల్ 2, ఆర్సీపురం పటాన్‌చెరు సర్కిల్‌లో 4 మొబైల్ టీమ్‌లు పని చేస్తాయని వెస్ట్ జోనల్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. టీమ్‌లు ఆయా సర్కిళ్ల ఈఈల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

వాటర్ లాగింగ్ పాయింట్లు ఇవే

శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో భారీ వర్షం కురిస్తే వరద నిలిచే అవకాశం ఉంది. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ ముందు, డీఎల్‌ఎఫ్, బయోడైవర్సిటీ జంక్షన్, మాదాపూర్ ఫేజ్–2, నెక్టార్ గార్డెన్, మాదాపూర్ మెయిన్‌రోడ్డు, శిల్పారామం, కొత్తగూడ జంక్షన్, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, పాపిరెడ్డినగర్ కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి, దీప్తిశ్రీనగర్, మదీనాగూడ, మియాపూర్, ఖాజాగూడ, లిడ్‌క్యాప్ సమీపంలోని జూబ్లీహిల్స్ లింకురోడ్డు తదితర చోట్ల వరద నీరు చేరుతున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించారు. ఇక చెట్లు పడిపోవడం, నాలాలు పొంగడం, కాలనీలు, అపార్ట్‌మెంట్లలోకి వరదనీరు చేరితే కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలి. ఆయా సర్కిళ్లకు త్వరలో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు కేటాయించనున్నారు. 24 గంటలు కంట్రోల్ రూమ్ పని చేస్తుంది.

వర్షం వస్తే గోదారులే..

- వర్షం వచ్చిందంటే గతంలో కన్నా రోడ్లపై వరద నీరు ఎక్కువగా చేరే అవకాశం ఉంది. ఐటీ కారిడార్‌లో 30 కిలోమీటర్ల లక్ష్యంగా పుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. దీంతో పలుచోట్ల వరద నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోయాయి. ప్రధాన రహదారుల వెంట వరద కాల్వల నిర్మాణం లేకపోవడం, నాలాలు, మ్యాన్‌హోళ్లలో చెత్త రడంతో కొన్ని చోట్ల వరద రోడ్లపై ప్రవహిస్తోంది. శిల్పారామం, మాదాపూర్‌లోని నెక్టార్ గార్డెన్, దీప్తి శ్రీనగర్, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరద నీరు నిలిచే అవకాశముంది.
- గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును మూసివేయడంతో వర్షం వస్తే ఇందిరానగర్, డీఎల్‌ఎఫ్, అంజయ్యనగర్‌లో ట్రాఫిక్ జామ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.
- వర్షం వచ్చే సమాచారాన్ని ముందే టీ కారిడార్‌లో పని చేసే వారికి తెలియజేయడం. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి.
- వరద ఉన్న రహదారుల వైపు కాకుండా ప్రత్యామ్నాయ రోడ్ల వైపు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించాలి.
- నాలాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, మ్యాన్‌హోల్స్‌లో పూడిక తీస్తే కొంత వరకు సమస్య తగ్గే అవకాశముంటుంది.

అందుబాటులో సిబ్బంది



మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేశాం. త్వరలో అధికారులను ఇన్‌చార్జులుగా నియమిస్తాం. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోను పని చేసేందుకు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో నేను, ఉప కమిషనర్లు విధులు నిర్వహిస్తాం. కంట్రోల్ రూమ్‌లు 24 గంటలు పని చేస్తాయి. వర్షంతో ఇబ్బందులు కలిగితే కంట్రోల్ రూమ్‌లకు సమాచారం ఇవ్వవచ్చు

– వెస్ట్‌జోన్ కమిషనర్ శంకరయ్య

పేద విద్యార్థుల కోసం బస్తీ ట్యూషన్లు

ప్రతి ఆదివారం సుందరయ్య కేంద్రంలో మెడికల్ క్యాంపు



కార్యక్రమంలో పాల్గొన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు

గచ్చిబౌలి: సుందరయ్య విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో బస్తీల్లో నివాసముండే పేద విద్యార్థులకోసం ప్రత్యేకంగా బస్తీ ట్యూషన్లను ప్రారంభిస్తున్నట్లు ఎస్‌వికే గచ్చిబౌలి మేనేజర్ విజయ్ వెల్లడించారు. కొత్తగూడలోని ప్రభుత్వ పాఠశాలలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మెడికల్ క్యాంపును ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. పేదలందరూ ట్యూషన్లు, మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న లక్ష్యం వైపు వెళ్ళేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రాములుగౌడ్, సావిత్ర మేఘన, నికిత, షర్మిల, ఉపాధ్యాయులు రమేష్ రాజ్, పద్మ, పద్మనాభాచారి, కావలి రమేష్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ స్వప్న పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభం



డిజిటల్ క్లాస్ రూమ్‌ను విద్యార్థులతో కలిసి ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను మంగళవారం విద్యార్థులతో కలిసి గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాలయాలకు ధీటుగా మారుస్తున్నారన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఈ సందర్భంగా సాయిబాబా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్యామల, పీఆర్‌టీయూ నాయకులు గాలి నరహరి, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సావిత్రి, నాయకులు చెన్నంరాజు, రమేష్‌గౌడ్, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



టిఫిన్ పే చర్చా లో జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్ తదితరులు

పటాన్‌చెరు టౌన్: బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్ అన్నారు. మంగళవారం బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన, అనంతరం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ''టిఫిన్ పే'' చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, నాయకులతో కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, అమీన్‌పూర్ కౌన్సిలర్ ఎడ్ల రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి , అమీన్‌పూర్ మున్సిపల్ అధ్యక్షుడు ఆగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తీసుకోవాలి



రాయదుర్గం: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని డా. రాజేష్ సూచించారు. మనూలో ప్రపంచ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే- 2023 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. యూనివర్శిటీలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణ్ డాట్ ఆర్గనైజింగ్ నుంచి హెల్త్ ఇనీషియేటివ్ హెడ్ డాక్టర్ పి రాజేష్ పాల్గొని మాట్లాడుతూ రక్తహీనత రహిత సమాజం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కేవిఆర్ ఫౌండేషన్ ప్రతినిధి కె శైలేష్‌బాబు మాట్లాడుతూ రక్తహీనత కోసం స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఉత్తమ మౌఖిక, పోస్టర్ ప్రజెంటేషన్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ అహ్మద్ ఖాన్, జువాలజీ హెడ్ ప్రొఫెసర్ పర్వీన్ జహాన్ ప్రసంగించారు.

కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్



చందానాయక్‌తండాలో పర్యటిస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు

మాదాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ విమర్శించారు. మాదాపూర్ డివిజన్‌లోని చంద్రానాయక్‌తండా, ధోబీఘాట్‌లలో మంగళవారం గడప గడపకు బీజేపీ పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి ఇంటికి కరపత్రాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, మదనాచారి, మధు యాదవ్, నాగార్జున, మహేందర్, వెంకటేష్, వంశీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ

హఫీజ్‌పేట్ : చందానగర్ శాంతినగర్‌లోని ప్రభుత్వం పాఠశాలలో మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెరిపెటి జైపాల్ విద్యార్థులకు నోట్‌బుక్‌లు, యూనిఫామ్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'మనూ'లో 'మీట్ ది ఆథర్'

రాయదుర్గం: మనూలో 'మీట్ ది ఆథర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. లిటరరీ క్లబ్, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని కల్చరల్ యాక్టివిటీ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని అజంఘడ్ లోని షిబ్లీ నేషనల్ కాలేజీకి చెందిన డాక్టర్ సర్ఫరాజ్ నవాజ్ సాహిత్యం, కవిత్వం, అనువాదంలోని వివిధ అంశాలపై విద్యార్థులకు వివరించారు. సాహిత్యం, కవిత్వం, అనువాదం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.

జగన్నాథస్వామి రథయాత్ర

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ఇస్నాపూర్ గ్రామంలో జగన్నాథస్వామి రథయాత్ర జై జగన్నాథ్ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ రథయాత్రలో పటాన్‌చెరు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జై జగన్నాథ్ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ఎస్‌ఆర్‌కే యువసేన సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా సీఎం సభ ఏర్పాట్లు

- పరిశీలించిన టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్

పటాన్‌చెరు: పట్టణంలో ఈనెల 22వ తేదీన సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నిర్వహించతలపెట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ శరత్‌తో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభావేదికతో పాటు, ప్రజల గ్యాలరీ, పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సభకు 30 వేలకు పైగా జనం హాజరుకానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బుధవారం సాయంత్రంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల స్వప్నం సాకారం కానున్న నేపథ్యంలో భారీగా సభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం పది మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేశారు.

శేరిలింగంపల్లిలో ఆరోగ్య మహిళా క్లీనిక్ ప్రారంభం



న్యూట్రిషన్ కిట్‌లను అందజేస్తున్న డాక్టర్ శైలజ కీర్తి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య మహిళా క్లీనిక్‌ను రంగా రెడ్డి జిల్లా డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సృజన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు చేస్తారన్నారు. డయాగ్నొస్టిక్స్, క్యాన్సర్, మహిళల నెలవారీ సమస్యలపై 8 రకాల పరీక్షలు చేస్తారని, అదే విధంగా ల్యాబ్‌లో 57 రకాల పరీక్షలు చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా 34 మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ కీర్తి, సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్‌ఎన్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యా దినోత్సవం

గచ్చిబౌలి/రాయదుర్గం: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ డ్రెస్‌లను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా సర్కారు బడులు కొత్తరూపు సంతరించుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్‌పటేల్, జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, మండల విద్యాధికారి వెంకటయ్య, డిప్యూటీ కమిషనర్ వెంకన్న, హెచ్‌ఎం తాజ్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

అదనపు గదులకు శంకుస్థాపన

కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో ప్రభుత్వ పాఠశాలలో రూ.69 లక్షలతో చేపట్టే అదనపు తరగతుల భవన నిర్మాణానికి కార్పొరేటర్ హమీద్‌పటేల్, డీసీ వెంకన్న, ఎంఈఓ వెంకటయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ 8వ బెటాలియన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మన ఊరు–మనబడి ద్వారా శేరిలింగంపల్లిలో 24, కూకట్‌పల్లిలో 7 కలిసి మొత్తం నియోజకవర్గంలో 31 పాఠశాలల్లో మొదటి విడత పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజ్‌గౌడ్, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చందానగర్ డివిజన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట ఉర్దూ మీడియం, వేమన కాలనీ వీకర్ సెక్షన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యా దినోత్సవంలో భాగంగా కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మన ఊరు– మన బడితో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయన్నారు. తెలంగాణ గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

అంబేడ్కర్‌నగర్ కాలనీలో..

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సుమారు రూ.23.05 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, కార్పొరేటర్లు పూజిత గౌడ్, జగదీశ్వర్ గౌడ్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్యామ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పుస్తకాలు అందజేత

శేరిలింగంపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారంలను అందజేశారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్, బీఆర్ఎస్ నాయకులు మిరియాల రాఘవరావు, ఉపాధ్యాయులు బలరాం, శివకుమార్,బల్వంత్‌రెడ్డి, గోపాల్, భాస్కర్‌యాదవ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



వేమన కాలనీ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్‌లను అందజేస్తున్న కార్పొరేటర్ మంజుల



8వ బెటాలియన్ ప్రభుత్వ పాఠశాలలో రూ.69 లక్షలతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్‌పటేల్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పరిధిలో వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యమయ్యారు. ఏఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన సామ కిరణ్ ప్రైవేట్ ఉద్యోగి. కిరణ్ భార్య శిరీష గొల్లబస్తీలో శివాలయానికి వెళ్లివస్తానని అత్తకు చెప్పి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త కిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి వెళ్లిన యువకుడు..

హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్నాపూర్‌కు చెందిన ప్రణీత్(19) డిప్లొమా చదువుతున్నాడు. ఈ నెల 18న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రణీత్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ప్రణీత్ సోదరుడు రాఘవేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోకుల్‌నగర్‌లో యువతి..

ఎస్ఐ దుర్గయ్య వివరాల ప్రకారం.. పట్టణంలోని గోకుల్‌నగర్‌కు చెందిన సమీరిన్ బేగం(25) ఈ నెల 19న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సమీరిన్ బేగం సోదరుడు రహీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్.. జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇటీవల ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462